క్లుప్తంగా

పాడి క్లీనర్‌ను పట్టించుకోరా?



వృథాగా ఉన్న పాడి క్లీనర్ మిషన్

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం తాలు తీసేందుకు ఉపయోగించే పాడి క్లీనర్‌ను పట్టించుకునే వారు కరువయ్యారు. ధాన్యం కొనుగోలు ముగిసిన అనంతరం పాడి క్లీనర్లను తమకేం పట్టనట్టుగా పీఏసీఎస్ సొసైటీ సిబ్బంది వదిలేసి వెళ్లారు. రూ.వేలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన పాడి మిషన్ వృథాగా వదిలేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, సొసైటీ నిర్వాహకులు క్లీనర్‌ను భద్రపరచాలని కోరుతున్నారు.

సకల సౌకర్యాలతో వెంచర్



వెంచర్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మంత్రి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల రెవెన్యూ వీరన్నపేట గ్రామ శివారులో 40 ఎకరాల్లో ఏర్పాటు చేసిన మధుర అవెన్యూ వెంచర్‌లో కల్పించిన సౌకర్యాలు భేషుగ్గా ఉన్నాయని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్బర్ అన్నారు. ఆదివారం వెంచర్ బోర్చర్‌ను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో మధుర అవెన్యూ డైరెక్టర్లు మంజుల దేవి, రామేశ్వర్‌సింగ్, కుష్బూ సింగ్, ఆదిత్యసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

మిరుదొడ్డి(దుబ్బాక): బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వద్దెల రాజేశ్ అన్నారు. ఆదివారం మిరుదొడ్డిలో మండల కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేసి వచ్చే ఎన్నికల్లో దుబ్బాక గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగరవేయడానికి కంకణబద్ధులు కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ నేరండ్ల భూమాగౌడ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అర్షద్ బేగ్, కార్యదర్శులు ఎల్లం, మహేశ్, కోశాధికారి సురేశ్, కార్యవర్గ సభ్యులు సుదర్శన్, అశోక్, కరుణాకర్, మహేందర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నగదు అందజేస్తున్న యాదగిరి దంపతులు

నంగునూరు(సిద్దిపేట): జేపీ తండాలో నిర్మిస్తున్న దుర్గాంజనేయ ఆలయ నిర్మాణానికి ఆదివారం గుగులోత్ యాదగిరి, మేఘన యజ్ఞశ్రీ దంపతులు రూ.1,21,116లు విరాళం అందజేశారు. సర్పంచ్ భిక్షపతినాయక్ మాట్లాడుతూ.. గ్రామస్తులు, దాతల సహకారంతో కమిటీ సభ్యులు ఆలయ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. నూతనంగా ఏర్పాటైన జేపీ తండా గ్రామానికి సహాయ, సహకారాలు అందిస్తున్న ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



విద్యార్థులతో ఉపాధ్యాయులు

సిద్దిపేటకమాన్: మూడు సంవత్సరాలు ఒకే కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో కలిశారు. సిద్దిపేట పట్టణంలోని చైతన్య భారతి డిగ్రీ కళాశాలలో 2003–06 బ్యాచ్‌కు చెందిన డిగ్రీ విద్యార్థులు తమ విద్యాభ్యాసం అనంతరం కొద్ది మంది ఉన్నత విద్య, మరికొంత మంది ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. చదువుతున్న రోజుల్లో చోటు చేసుకున్న సంఘటనలు, తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్నేహితులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ముచ్చటించారు. విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను కూడా కలవడం సంతోషంగా ఉందన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ తెరిచేదెప్పుడో?

- ఆర్భాటంగా ప్రారంభించి వదిలేసిన వైనం
- రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మాణం



కొత్తగా నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

హుస్నాబాద్: పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాలో కొత్తగా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించిన కాంప్లెక్స్‌ను మే 5వ తేదీన మున్సిపల్ శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. హుస్నాబాద్ గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో నాలుగు షెట్టర్లను నిర్మించగా, ప్రస్తుతం వాటిని కూల్చివేశారు. ఇక్కడే ఆరుగుంటల స్థలంలో పట్టణ అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల సౌకర్యాలతో రెండు అంతస్తుల్లో 18 గదులను వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు విశాలంగా నిర్మించారు. షాపింగ్ కాంప్లెక్‌ను ప్రారంభించి నేటికీ దాదాపు 2 నెలలు గడుస్తున్నా దుకాణ సముదాయం అందుబాటులోకి రావడం లేదు. నడిబొడ్డున మల్లెచెట్టు చౌరస్తాలోని మెయిన్ రోడ్‌లో అద్దె గది కావాలంటే ఎంత లేదన్నా నెలకు రూ.20 వేలు చెల్లిస్తే గాని దొరకని పరిస్థితి. ఇంత పెద్ద మొత్తంలో అద్దె చెల్లించుకోలేని చిరు వ్యాపారులు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఓ చిన్న గదినైనా అద్దెకు తీసుకోవాలని ఆరాటపడుతున్నారు. బయట కంటే మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో తక్కువ ధరకు అద్దె గది దొరుకుతుందని వ్యాపారులు ఆశతో ఎదురుచూస్తున్నారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం టెండర్ పద్ధతిన ఈ గదులను కేటాయించనున్నారు.

వారం రోజుల్లో పూర్తి చేస్తాం



నూతనంగా నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల్లో భాగంగా చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయి. ముఖ్యంగా టాయిలెట్ల పనులు పూర్తి కావొస్తున్నాయి. ఈ పనులు వారం రోజుల్లో పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం. దుకాణ సముదాయంలోని గదులను టెండర్ ప్రక్రియ ద్వారానే కేటాయిస్తాం.

–రాజమల్లయ్య, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

ఘనంగా డీసీసీబీ డైరెక్టర్ జన్మదిన వేడుకలు



ములుగులో అంజిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, తదితరులు

ములుగు(గజ్వేల్): డీసీసీబీ డైరెక్టర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి జన్మదినోత్సవ వేడుకలు ఆదివారం ములుగు మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్.యాదవరెడ్డి, రాష్ట్ర ఫుడ్స్ సంస్థ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ దేవేందర్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొని అంజిరెడ్డికి అభినందనలు తెలియజేశారు. తన జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ములుగులో మొక్కలు నాటిన అంజిరెడ్డి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. భారీ వాహన శ్రేణితో ర్యాలీగా ములుగులోని వేదిక వద్దకు చేరుకొని అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వేదిక ప్రాంగణంలో రక్తదాన శిబిరం కొనసాగింది. వర్గల్ మండలం గౌరారం గ్రామానికి చెందిన పేద విద్యార్థిని దేవునూరు అలేఖ్య ఉన్నత చదువుల కోసం ఆయన రూ.50,000లు అందజేశారు.

మర్కూక్(గజ్వేల్): మండలంలోని సీఎం దత్తత గ్రామమైన ఎర్రవల్లి సర్పంచ్ భాగ్యభిక్షపతి ఆధ్వర్యంలో డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డిని కలిసి పలువురు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా తమ ఇంటి ఆవరణలోని గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్క నాటించి సన్మానించి, కేక్‌కట్ చేసి సంబరాలు చేపట్టారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ తల్లి పల్లె పాడి పంటలను చల్లగా చూడాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేలా చూడు అంటూ డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అమ్మవారికి పూజలు చేశారు. కొండపోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నరేశ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు కావ్య, సర్పంచ్ రజిత వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

గజ్వేల్‌రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన సత్తయ్య ఇటీవల ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.57వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, ఫ్యాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రమేశ్‌గౌడ్, అహ్మద్, నిజామొద్దీన్, ముత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు



రామునిపట్లలో బోనాల ఊరేగింపులో మహిళలు



కొమురవెల్లిలో బోనాలతో మహిళలు



హుస్నాబాద్‌రూరల్: బోనాలతో వస్తున్న మహిళలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనమెత్తుకొని డప్పు చప్పుళ్లు, ఒగ్గు డోలు, పోతరాజుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి వెళ్లారు. ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్లగా దీవించమ్మా తల్లి అంటూ అమ్మవారిని వేడుకున్నారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలోని బేడ బుడుగ జంగాల కాలనీలో గ్రామదేవతల బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా బోనాలు తీసి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి పిల్లాపాపలను చల్లగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు.

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు చేశారు. వర్షాలు సంమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని కోరుతూ అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో రెడ్డి సంఘం, గుండారంలో మున్నూరు కాపు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ప్రధాన వీధుల గుండా ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణం సుడా కార్యాలయం ఎదురుగా ఉన్న మైసమ్మ ఆలయంలో మైసమ్మ ఫ్యామిలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆషాడ మాస బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించి, ఒడిబియ్యం పోసి మహిళలు, భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలతో పెద్దఎత్తున పాల్గొన్నారు.

దుబ్బాకరూరల్: మండలంలోని గంభీర్‌పూర్‌లో మహంకాళి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాలు సంమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.

పారిశుద్ధ్య కార్మికులపై ప్రభుత్వం కక్ష



కార్మికులకు మద్దతు తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పారిశుధ్య కార్మికులపై ప్రభుత్వం కక్ష కట్టిందని డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్‌లో పారిశుధ్య కార్మికుల సమ్మెకు ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పల్లెలను పరిశుభ్రంగా ఉంచడంలో వారిది కీలకపాత్ర అని, వారి ఆరోగ్యాలను పక్కన పెట్టి ప్రజల ఆరోగ్యం కోసం పనిచేసే వారిపై ప్రభుత్వం కక్ష పెంచుకోవడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు మల్లేశం, బాల్‌రెడ్డి, వెంకటేశం, నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అహ్మద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం నాలుగో రోజుకు చేరింది. కార్మికులు సమ్మె చేస్తుండడంతో కొమురవెల్లి జీపీ అధికారులు గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు తాత్కాలిక పద్ధతిలో చెత్త బండికి డ్రైవర్‌ను నియమించారు. వారు చెత్త తీసుకునేందుకు గ్రామంలోకి వెళ్లగా సమ్మె చేస్తున్న కార్మికులు ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. జీపీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని కార్మికులు తెలిపారు.

కొండపాకలో..

కొండపాక(గజ్వేల్): ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికుల యూనియన్ జిల్లా నాయకులు బర్మ కొమురయ్య మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి జీపీ కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి అమ్ముల బాల్‌నర్సయ్య, నాయకులు పోషయ్య, ప్రభాకర్, కిన్నెర, కళవ్వ, తలారి పోషయ్య, కొమ్ము నర్సింలు, రాజవ్వ, లచ్చవ్వ, నరహరి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం



హుస్నాబాద్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

హుస్నాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం ఏబీవీపీ 75వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా జెండావిష్కరణ చేశారు. అనంతరం ఏబీవీపీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏర్పడి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ నిరంతరంగా పోరాడుతుందన్నారు. సామాజిక సేవలో కూడా భాగమై, విద్యార్థి దశలో నాయకత్వ లక్షణాలు నేర్పుతూ, యువతతో దేశభక్తిని నింపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆదిత్య, విద్యార్థి పరిషత్ పూర్వ కార్యకర్తలు శ్రీనివాస్, వెంకటేశ్, సతీష్, సంపత్‌నాయక్, నాయకులు రాజేశ్, చరణ్, అంజి, పరశురాం, ఉమాదేవి తదితరులు ఉన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ నిరంతర పోరాటం చేస్తుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోయిన చంద్రకుమార్ అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఆదివారం ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మొగుళ్ళ మల్లేశం, మండల అధ్యక్షుడు ఎల్కుల దేవరాజు, నాయకులు కరుణాకర్, సురేశ్, అంజి, రాజు, సాయి, గొల్ల విజయ్, సాయి, పరశురాములు, రామాచారి, నక్క సాయి, రూపేశ్, సుధాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వివేక్ ఆధ్వర్యంలో వీర సావర్కర్ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, పూర్వ కార్యకర్తలు శ్రీకాంత్, ఉపేందర్, సుమన్, భాస్కర్, పవన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007–08లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యం జ్ఞాపకాలను గుర్తు చేసుకొని విద్యార్థులు ఆనందంగా గడిపారు. ఒకరికొకరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ వారి జీవిత విషయాలను పంచుకున్నారు. చదువు చెప్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బండారి మనీల, రవి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

సంక్షిప్త వార్తలు

◆ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

సిద్దిపేటకమాన్: విరివిగా మొక్కలు నాటి పరిరక్షించినప్పుడే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు అన్నారు. సిద్దిపేట ఎన్సాన్‌పల్లి రోడ్డులో ఆదివారం మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవనశైలిలో మార్పులతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, హరితహారం అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ మానవత్వం చాటిన స్నేహితులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన బబ్బూరు శ్రీనివాస్ భార్య మాధవి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ చిన్ననాటి స్నేహితులు మృతిరాలి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల కోసం రూ.20వేల ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, కరుణాకర్‌రెడ్డి, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, ఐలయ్య, యాదగిరి, ప్రవీణ్, మట్టి మనిషి ఫౌండేషన్ చైర్మన్ పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

◆ స్నేహితుడి కుటుంబానికి అండగా..

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణానికి చెందిన నిరుపేద చేనేత కార్మికుడు గౌరిట్యాల ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. దీంతో ఆ పేద కుటుంబం రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రసాద్ మృతితో భార్య, ఇద్దరు ఆడపిల్లల పరిస్థితి దయనీయంగా తయారైంది. విషయం తెలుసుకున్న ప్రసాద్‌తో టెన్త్ చదివిన స్నేహితులు తహసీల్దార్ (ప్రస్తుతం మంత్రి హరీశ్‌రావు ఓఎస్డీగా పనిచేస్తున్న) ఎస్‌వై గిరి, దుబ్బాక మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల దేవేందర్, ఆస ప్రభాకర్, కారంపురి బాల్‌రాజు, అక్బర్‌లు ఆదివారం పరామర్శించి ఇద్దరు కూతళ్లకు తలా రూ.25 వేల చొప్పున పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలు అందించారు. మిత్రుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీనిచ్చారు.

◆ బాధితుడికి సాయం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రానికి చెందిన పుర్మ దయాకర్‌రెడ్డి 5 ఏళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ కదలలేని స్థితిలో ఇంట్లోనే ఉంటున్నాడు. భార్య కూడా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న పట్టణ కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మంగళగిరి రాంచంద్రమూర్తి, తన పూర్వ విద్యార్థులు రాము, శ్రీనాథ్, ప్రశాంత్, రామయ్య, భాస్కర్, రాంప్రకాష, లింగరాజు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు సుధాకర్‌లు కలిసి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు.

◆ పరామర్శ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కరుణాకర్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన లచ్చవ్వ ఇటీవల మృతి చెందింది. ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సాయం అందించారు. అదేవిధంగా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి కరుణాకర్ కుటుంబాన్ని పరామర్శించి రూ.4వేల ఆర్థికసాయం అందించారు. అలిరాజ్‌పేటలో రాచమల్ల కిష్టయ్య గుండెపోటుతో మృతి చెందడంతో ఆదివారం రజక సంఘం మండల అధ్యక్షుడు ఏల్లేశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల నగదు అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్, సర్పంచ్‌లు లక్ష్మి, లావణ్య, వివిధ పార్టీల నాయకులు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

◆ ఆర్థికసాయం

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన బాల్‌రాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, ఎంపీటీసీ నర్సింలు పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా గ్రామ కురుమ సంఘం నాయకులు రూ.10వేలు, తొగుట ఏఎంసీ మాజీ డైరెక్టర్ బండారు రమేశ్‌గౌడ్ రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు.

◆ టీ–9 టికెట్‌ను సద్వినియోగం చేసుకోండి

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు టీ–9 టికెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ తెలిపారు. ఆదివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. ప్రయాణికులపై ఆర్థికభారం తగ్గించేందుకు టీ–9 టికెట్‌ను ప్రవేశపెట్టిందని, రూ.100 చార్జి చెల్లించి 60కిలో మీటర్ల పరిధిలో ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చని తెలిపారు. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే మహిళలు, సీనియర్ సిటిజన్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తిరుగు ప్రయాణంలో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రూ.20 చెల్లించి ప్రయాణించే సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

◆ సమస్యలు పరిష్కరించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అంజి అన్నారు. సిద్దిపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 12వ తేదీన విద్యాసంస్థలను బంద్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి చక్రి తదితరులు పాల్గొన్నారు.

◆ నిందితులపై చర్య తీసుకోవాలి

గజ్వేల్‌రూరల్: దళితులను అవమానపరిచిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌లో దళితులను అవమానించే విధంగా వ్యవహరించడంతో పాటు గతంలో సైతం సహపంక్తి భోజనాల సమయంలో వివక్ష చూపినట్లు గుర్తు చేశారు. వెంటనే స్పందించి దళితులను అవమానపరిచే విధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, మైసయ్య తదితరులున్నారు.

◆ అమ్మవారి దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అమ్మవారి దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం పట్టణంలోని 13వ వార్డు బీడీ కాలనీలో నిర్వహించిన మైసమ్మ బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారి దయతో ప్రజలందరికీ మంచి జరగాలన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యం, బోనాలు సమర్పించారు అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

◆ సిద్దప్ప రచనలకు గుర్తింపు

కోహెడరూరల్(హుస్నాబాద్): సిద్దప్ప రచనలకు ప్రభుత్వం తగిన గుర్తింపునిచ్చినట్లు ఎంపీపీ కొక్కుల కీర్తిసురేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని గుండారెడ్డిపల్లిలో తెలంగాణ వేమనగా ప్రసిద్ధికెక్కిన సిద్దప్ప వరకవి 120వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఓరిగంటి అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ సుతారి కల్యాణికనకయ్యతో కలిసి సిద్దప్ప ఆశ్రమంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిద్దప్ప కుమారుడు మాణిక్యలింగం, ఉపసర్పంచ్ రాములు, పంచాయతీ కోఆప్షన్ సభ్యులు సంజీవరెడ్డి, కనకయ్య, ఉపాధ్యాయుడు సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్, కుమారస్వామి, కిషన్, యాదగిరి పాల్గొన్నారు.

◆ జనాభా నిష్పత్తి ప్రకారం వాటా కేటాయించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రానున్న రాజకీయ సంగ్రామంలో యాదవ జనాభా నిష్పత్తి ప్రకారం వాటా కేటాయించాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ అన్నారు. సిద్దిపేట పట్టణ శివారులోని యాదవ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం యాదవ యుద్ధభేరి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 13న నిర్వహించ తలపెట్టిన యుద్ధభేరిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీహరి, రాజు, వెంకటేశ్, పరశురాములు, ఐలయ్య, కనకయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.